క్లుప్తంగా

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో డ్రాగన్ షోటోకాన్ కరాటేడూ స్పోర్ట్స్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు షోటోకాన్ అర్బన్ అధ్యక్షుడు ఎస్‌కే.మోసీన్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో అభినందించారు. ఫౌండర్ సాలం బిన్ ఉమర్, చీఫ్ ఎగ్జామినర్ అమ్రేష్, మదనాపురం ఎస్ఐ మురళీకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాఘవేందర్, సత్యం, శేఖర్, ఆంజనేయులు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య సాధన దినోత్సవం



జడ్చర్ల టౌన్: ఎమ్మార్పీఎస్ ఉమ్మడిజిల్లా కన్వీనర్ జంగయ్య మాదిగ మందకృష్ణ పోరాట ఫలితమే ఆరోగ్యశ్రీ అని అన్నారు. ఆయన వల్లే నాటి సీఎం వైఎస్ఆర్ స్పందించి 2004లో ఆరోగ్యశ్రీ ప్రారంభించారని వివరించారు. ఈ మేరకు ప్రారంభించిన రోజును పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ప్రజాయుద్ధనౌక గద్దర్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వినోద్‌కుమార్, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి. శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఖాళీప్లాట్ల చదును

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు పోచమ్మ దేవాలయం సమీపంలోని ఖాళీప్లాట్లలో మురికినీరు నిలిచి ఉండటంతో స్పందించిన వార్డు కౌన్సిలర్ కుమ్మరి రాజు వాటి యజమానులతో మాట్లాడి చదును చేయించారు. మొరం మట్టిని ప్లాట్లలో వేయించి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నారు. ఇకపై చెత్తాచెదారం లేకుండా, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్లాట్ల యజమానులకు సూచించారు.

విజయవంతం చేయండి

నవాబుపేట: హైదరాబాద్‌లో ఈ నెల చివరి వారంలో జరిగే ఎమ్మార్పీఎస్ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని సీనియర్ నాయకులు టైగర్ జంగయ్య, శాంతయ్యలు పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు యాదయ్య, జంగయ్య, బాల్‌రాజ్, శంకర్, శ్రీను, లక్ష్మన్, వెంకటయ్య పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష

అడ్డాకుల: వనపర్తి జిల్లా కొత్తకోట మండలం నిర్వెన్ గ్రామానికి చెందిన పెద్దన్నగారి సురేష్ ఇటీవల మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతూ తనిఖీల్లో పట్టుబడ్డాడని అడ్డాకుల ఎస్ఐ మాధవరెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లోని స్పెషల్ జ్యుడీషియల్ సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నిర్మల సోమవారం నిందితుడిని హాజరు పర్చగా ఒక రోజు జైలుశిక్ష, రూ.2వేల జరిమానాను విధించినట్లు వివరించారు.

దోమల మందులు పిచికారీ చేయండి

భూత్పూర్: మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో దోమల నివారణకు మందులు పిచికారీ చేయాలని టీపీసీసీ మైనార్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధిక్ ప్రకటనలో పేర్కొన్నారు. నెలలు గడుస్తున్నా ఫాగింగ్ చేయడంలో మున్సిపాలిటీ అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా కొన్ని రోజులుగా చిన్నారులు, పెద్దలకు సైతం కళ్లకలక అంటువ్యాధి సోకుతోందని ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు.

నేడు గొర్రెల పంపిణీ

గండేడ్: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం గొర్రెల పంపిణీ కార్యక్రమం ఉంటుందని బీఆర్ఎస్ అధ్యక్షుడు పెంట్యానాయక్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి హాజరు కానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయలని అన్నారు.

కాంగ్రెస్ సమావేశం..

గండేడ్: మండల స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు నరసింహరావు తెలిపారు. వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని వివరించారు.

11న సర్వసభ్య సమావేశం

రాజాపూర్: బాలానగర్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కమల, ఎంపీడీఓ కృష్ణారావులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విధిగా పాల్గొనాలని సూచించారు.

ముర్రుపాలే మొదటి టీకా



మర్లులో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



జిన్నారంలో..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/మహబూబ్‌నగర్ రూరల్: ముర్రుపాలే బిడ్డకు మొదటి టీకాగా పని చేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద అన్నారు. సోమవారం పట్టణంలోని మర్లు కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కౌన్సిలర్ నరేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమైనవని వివరించారు. బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా బండ్లగేరి కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన వారోత్సవాల్లో సీడీపీఓ రాజేశ్వరి కౌన్సిలర్ పద్మ, సూపర్‌వైజర్ వసీం సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: పిల్లలకు తల్లి పాలే శ్రేష్ఠం అని మండల ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు గోపాల్ పేర్కొన్నారు. సోమవారం జిన్నారంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో తల్లి వారోత్సవాలను నిర్వహించారు. సర్పంచ్ ఖాజప్ప, సూపర్‌వైజర్ రాధిక, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: చేద్‌ఘాట్ తండా, లింబా తండాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సర్పంచ్ మేఘన, హెచ్‌ఎం మల్లయ్య, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండల కేంద్రంతో పాటు వెంకట్‌రెడ్డిపల్లిలో వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, లలిత పాల్గొన్నారు.

గిరిజనులకు రక్షణ కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మణిపూర్‌లో గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని పలువురు నాయకులు అన్నారు. ఘటనలపై జిల్లా కేంద్రంలో సోమవారం ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ విభాగం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. దాడులు చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు లింగంనాయక్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎండి.ఫయాజ్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీసెల్ అధ్యక్షుడిగా శ్రీనునాయక్

మిడ్జిల్: మండల కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షుడిగా సింగం దొడ్డి తండాకు చెందిన శ్రీనునాయక్‌ను నియమిస్తున్నట్లు సోమవారం జిల్లా అధ్యక్షుడు లింగం నాయక్ తెలిపారు. ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. శంకర్‌నాయక్, గంగ్యానాయక్, బద్రునాయక్ పాల్గొన్నారు.

దేవరకద్ర మార్కెట్‌లో హరితహారం



దేవరకద్రలో మొక్కలు నాటుతున్న మార్కెట్ చైర్ పర్సన్ తదితరులు

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని మార్కెట్ యార్డులో సోమవారం హరిత హారం కార్యక్రమం నిర్వహించారు. చైర్ పర్సన్ విజయ ఆధ్వర్యంలో అధికారులు, వ్యాపారులు, ఇతర సిబ్బంది పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్క పెరగాలని మార్కెట్ చైర్ పర్సన్ సూచించారు. వైస్ చైర్మన్ దశరథరెడ్డి, కార్యదర్శి జయలక్ష్మి, పాలక వర్గం సభ్యులు, వ్యాపారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మొక్కల పంపిణీ

జడ్చర్ల టౌన్: హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ మొక్కల పంపిణీ మున్సిపాలిటీలో కొనసాగుతోంది. సోమవారం 12వ వార్డులో మొక్కలు అందజేశారు. చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్ పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయించాలి



టీకాలు వేసే విధానం వివరిస్తున్న అధికారి

మహమ్మదాబాద్: చిన్న పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని మహమ్మదాబాద్ మెడికల్ ఆఫీసర్ రహమత్ తెలిపారు. సోమవారం మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. టీకాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ రాఘవేందర్, ఎంపీహెచ్‌ఓ సత్యమ్మ, ఎంఎన్‌ఓ జాంగీర్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

భూత్పూర్: చిన్నారులకు, గర్భిణులకు సకాలంలో టీకాలు వేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శంకర్, ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యాకిరణ్మయి అన్నారు. సోమవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. మిషన్ ఇంద్రధనుస్సు పనితీరును అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి అబ్దుల్ రబ్, హిమబిందు, సూపర్‌వైజర్లు యాదమ్మ, సుధాకర, హెల్త్ అసిస్టెంట్‌లు తదితరులు ఉన్నారు.

'ప్రజా యుద్ధనౌక'కు ఘననివాళి



జిల్లాకేంద్రంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

జడ్చర్ల: ప్రజాయుద్ధనౌకగా పేరొందిన గద్దర్ మరణం తీరని లోటని రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్ అన్నారు. సోమవారం అంబేడ్కర్ చౌరస్తాలో ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు జంగయ్య, బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ బాలవర్ధన్ గౌడ్ తదితరులు ఉన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి, తదితరులు సోమవారం గద్దర్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో పొందుపరచాలని, ట్యాంక్ బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేయాలని అన్నారు. అదేవిధంగా గద్దర్ మరణం ప్రజలకు తీరని లోటని మాలల చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మూలె కేశవులు అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. రాజయ్య, పత్తి యాదయ్య, వెంకట్రాములు, కాంతారావు, విఠల్, దాస్, వెంకటేష్, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలో యాదవ సంఘం అధ్యక్షుడు భీమన్నయాదవ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పంచాయతీ కార్మికులు తదితరులు ఉన్నారు.

గండేడ్: మండల కేంద్రంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు నివాళులు అర్పించారు. బోరు కృష్ణయ్య, పెద్ద వెంకటయ్య, శ్రీనివాస్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, నాయకులు బాలు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: కొత్త మొల్గరలో మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, వెంకటేష్, మురళీ తదితరులు గద్దర్‌కు నివాళి అర్పించారు.

జీపీ కార్మికుల సమ్మెకు మద్దతు



మాట్లాడుతున్న ఎర్రశేఖర్

రాజాపూర్: పంచాయతీ కార్మికుల తమ న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని మాజీఎమ్మెల్యే ఎర్రశేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. కొన్ని రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. తక్షణమే డిమాండ్లు నెరవేర్చాలని అన్నారు. కాంగ్రెస్ కార్మికులకు అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, లింగం, జీవన్‌రెడ్డి, మైనార్టీ నాయకులు నజీర్‌తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నిరవధికంగా సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలన్నారు. కార్మిక సంఘం నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాస్, రమేష్, నర్సింహులు, వెంకటయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణపై హర్షం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరించడంపై డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాహుల్‌ను రాజకీయంగా దెబ్బతీయాలని బీజేపీ కుట్రపూరితంగా ఆయనపై తప్పుడు కేసుపెట్టించి లోకసభ సభ్యత్వాన్ని రద్దు చేయించిందని ఆరోపించారు. సభ్యత్వం పునరుద్దరణ బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదన్నారు.

ఆదేశాలు వెనక్కి తీసుకోవాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సంఘాలను, మీడియాను సంక్షేమ హాస్టల్స్, పాఠశాలలు, కళాశాలల్లోనికి అనుమతించవద్దని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఐఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేవారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. లోపాలను ఎత్తి చూపుతారనే భయంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఎంబీఏ డిపార్ట్‌మెంట్‌లో పీజీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థి పవన్‌తేజ్ యూజీసీ నెట్ -2023 జేఆర్ఎఫ్(జూనియర్ రీసెర్చ్ ఫెల్లోషిప్) సాధించారు. ఈసందర్భంగా డిపార్ట్‌మెంట్ అధ్యపకులు అతడిని ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ కిషోర్, హెచ్‌ఓడీ అర్జున్‌కుమార్, జావెద్‌మసూద్, నాగసుధ, అరుంధతి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



దేవరకద్ర: సీజనల్‌గా వచ్చే వ్యాధులపై దేవరకద్ర ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయుర్వేద వైద్యంలో మంచి మందులు ఉన్నాయని వాటిని ఉపయోగించాలని వైద్యురాలు శైలజారెడ్డి సూచించారు. వీటిని ఉపయోగించడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండదని రోగ నిరోధక శక్తిని పెంచే మందులు కూడా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం నిర్ణయం హర్షణీయం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలోని ఉద్యోగులకు పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి అంతకు ముందే మధ్యంతర భృతి ప్రకటిస్తామని సీఎం కేసీఆర్ చెప్పడం హర్షనీయమని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా మధ్యంతర భృతి ఎప్పుడు ఇస్తారో స్పష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులు, పీఆర్‌సీ డీఏ బకాయిలు ఈకుబేర్‌లో 14 నెలల నుంచి పేరుకుపోయాయని, వెంటనే వాటి పరిష్కారం కోసం సీఎం ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

మిడ్జిల్: చిల్వేర్‌కి చెందిన కర్నె యాదయ్య అనారోగ్యంతో సోమవారం మృతిచెందగా స్థానిక కాంగ్రెస్ నాయకులు విషయాన్ని టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన తక్షణసాయం కింద రూ. అయిదు వేలు బాధిత కుటుంబానికి పంపించారు. ఈ మేరకు ఎంపీటీసీ రాజారెడ్డి బాధితులను పరామర్శించి డబ్బులను అందజేశారు. నాయకులు సత్యం, నాగార్జున తదితరులు ఉన్నారు.

పరామర్శ

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన పరుశరాములు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటివద్దే విశ్రాంతి తీసుకుంటుండగా సోమవారం మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా అనారోగ్యానికి గురైన సింగిల్‌విండో డైరెక్టర్ రాజవర్ధన్‌రెడ్డిని పరామర్శించారు.

బీసీల జీవితాల్లో వెలుగురేఖ



నివాళి అర్పిస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: బీసీల జీవితాల్లో వెలుగురేఖ బిందేశ్వరీప్రసాద్ మండల్ అని వక్తలు అన్నారు. సోమవారం ఆయన జయంతి సందర్భంగా బీసీసేన ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, రజకసంఘం జాతీయ నాయకుడు నడిమింటి శ్రీనివాస్, వడ్లని శేఖర్‌యాదవ్, ఎమ్మార్పీఎస్ ఉమ్మడిజిల్లా కన్వీనర్ జంగయ్య మాదిగలు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రజాసంఘాల నాయకులు బాలవర్ధన్‌గౌడ్, తెలుగు సత్తయ్య, ఫకీర్ జహంగీర్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఎస్ఐలుగా ఎంపికైన విద్యార్థులకు సన్మానం



బలీదుపల్లిలో తారకకు సన్మానం



జడ్చర్లలో కృష్ణాజీని సన్మానిస్తున్న అధ్యాపకులు

జడ్చర్ల టౌన్: సివిల్ ఎస్ఐగా ఎంపికైన బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి కృష్ణాజీని సోమవారం ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ, అధ్యాపకబృందం పాల్గొన్నారు.

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ యాదవ్, వెంకటేశ్వరమ్మ దంపతుల కుమార్తె తారక సివిల్ ఎస్ఐగా ఉద్యోగం సాధించడంతో సోమవారం ఆమెను ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ కోఆప్షన్ మహిమూద్, సర్పంచ్ పాశం తిరుపతయ్య, మండల యాదవ సంఘం అధ్యక్షుడు భీమన్నయాదవ్ ఉన్నారు. అదేవిధంగా మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి తారకకు మిఠాయి తినిపించారు. ఆమె తల్లిదండ్రులను అభినందించారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తత అవసరం



పెద్దవడ్డెమాన్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గండేడ్: సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని ఎస్ఐ సురేష్ పేర్కొన్నారు. సోమవారం వెన్నాచేడ్ మాడల్ స్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువ అవుతున్నాయని అన్నారు. మోసాలకు అమాయకులు బలి అవుతున్నారని పేర్కొన్నారు. మూతాలు చేసే ఫోన్లకు ఏమాత్రం స్పందించవద్దని సూచించారు. కార్యక్రమంలో కేర్ టేకర్ వీణా, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: పెద్ద వడ్డెమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో సైబర్‌నేరాలు, మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాపై అవగాహన కల్పించారు. పాఠశాల పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థికి అనుకూల పద్ధతిలో బోధించాలి

జడ్చర్ల టౌన్: ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకుని సామర్థ్యాలు పెంచుకుని విద్యార్థులకు బోధన చేయాలని ఎంఈఓ మంజులాదేవి సూచించారు. పట్టణంలోని గీతాశ్రీ పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. విద్యార్థి అనుకూల పద్ధతిలో బోధించాలన్నారు.

ఉపసర్పంచ్ సంతకం ఫోర్జరీ

మహమ్మదాబాద్ : సంతకం ఫోర్జరీ చేశాడని మల్టీపర్పస్ వర్కర్‌పై కేసునమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. నంచర్లకి చెందిన మల్టీపర్పస్ వర్కర్ సందీప్‌చారీ ఉప సర్పంచ్ పావని సంతకం ఫోర్జరీ చేశాడని పోలీసులు తెలిపారు. తద్వారా రూ. 89,186 నిధులను ఎస్‌టీఓలో దాఖలు చేసి కార్మికుల ఖాతాలో పడ్డాయని డ్రా చేశారన్నారు. ఉప సర్పంచ్‌పావని ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఈవీఎంలపై అవగాహన



గండేడ్: ఈవీఎంలపై అధికారులు వెన్నాచేడ్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానికులకు ఓటు వేసే విధానం తదితర అంశాలను వివరించారు. అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆర్ఐ ఫహేద్, వీఆర్ఏలు, ఏఎస్ఎం, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చెరువు తెగి ఏడాది.. ఇస్తామన్న పరిహారమేది?



గత ఏడాది ఆగస్టు 8న తెగిన నవాబుపేట, యన్మన్‌గండ్ల పెద్ద చెరువు (ఫైల్)

నవాబుపేట: నవాబుపేట, యన్మన్‌గండ్ల జంట గ్రామాలకు చెందిన పెద్ద చెరువు తెగి మంగళవారంతో ఏడాది పూర్తికానుంది. అయినా ఇప్పటికీ ఘటనలో నష్టపోయిన బాధితులకు ఎటువంటి పరిహారం అందలేదు. అప్పట్లో పరిహారం ఇస్తామని ఇచ్చిన హామీని అధికారులు మరిచిపోయారని రైతులు వాపోతున్నారు. గత ఏడాది సరిగ్గా ఇదే రోజు దాదాపు రెండేళ్ల తరువాత పెద్ద చెరువు నిండింది. దీంతో మండల కేంద్రంతో పాటు యన్మన్‌గండ్ల, రుక్కంపల్లి గ్రామస్తులు సంబురాలు చేసుకున్నారు. కానీ ఆనందాన్ని ఆవిరి చేస్తూ గంటల వ్యవధిలోనే చెరువు తెగింది. దీంతో అప్పటికే ఆయకట్టులో వేసిన 180 ఎకరాల వరి పంట నీటిపాలైంది. అదేవిధంగా 49 ఎకరాల్లో మొక్కజొన్న కొట్టుకుపోయింది. చెరువులో ఉన్న రూ. 22 లక్షల విలువైన చేపలూ చేతికందకుండా పోయాయి. దీంతో దాదాపుగా రూ.కోటికి పైగానే రైతులు నష్ట పోయారు. ఈ నేపథ్యంలోనే పరిహారం ఇస్తామని అధికారులు గ్రామాల్లో విచారణలు సైతం చేపట్టారు. కానీ నేటికీ చిల్లిగవ్వకూడ ఇవ్వలేదని బాధితులు వాపోతున్నారు. విషయంపై ఆరాతీస్తే అధికారులకు పంట నష్ట పరిహారంపై ఎలాంటి ఆదేశాలు అందలేదని తెలిసింది.

పరిహారం ఇస్తామన్నారు కానీ..



చెరువు కట్ట తెగిన వెంటనే వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు నష్ట పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రభుత్వం మరోసారి ఆలోచించాలి.

–ఆనంద్,
పెద్దచెరువు మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు

అస్తవ్యస్తంగా రోడ్డు



అడ్డాకుల: మూసాపేట మండలంలోని నందిపేట నుంచి దేవరకద్ర మండలంలోని జీనుగరాల రోడ్డు పూర్తి అస్తవ్యస్తంగా మారింది. సుమారు 3.5కిలోమీటర్ల దూరం ఉన్న బీటీరోడ్డు పూర్తిగా గుంతలమయంగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్లడానికి సమస్యగా మారిందని పలువురు వాపోతున్నారు. నందిపేట నుంచి దేవరకద్రకు వెళ్లడానికి ఇదే దారి కావడంతో గ్రామస్తులు జీనుగరాల మీదుగా వెళ్తారు. కానీ ప్రస్తుత వర్షాకాలంలో గుంతల్లో నిలిచే నీరు, అక్కడక్కడ కంకర తేలడం వంటివి ప్రయాణీకులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వాహనాలు అదుపు తప్పుతున్నాయి. పలు సందర్భాల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. నందిపేటతో పాటు అడ్డాకుల మండలంలోని రాచాల, పొన్నకల్, దుబ్బపల్లి, కందూర్, శాఖాపూర్, మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి గ్రామస్తులు కూడా ఇదే రోడ్డుపై దేవరకద్రకు వెళ్తారు. ఈనేపథ్యంలో రోడ్డును బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.